ఆర్థరాత్రి ఒంటిగంట దాటిన తరువాత రచయిత శ్రీపతి లైటు తీసేసి భార్య లక్ష్మి ప్రక్కన జేరి చెయ్యి వేశాడు. నిద్రపట్టక నిద్రపోతున్నట్టు నటిస్తున్న లక్ష్మి ఒక్క విసురున చెయ్యి తీసిపారే సింది. లక్ష్మి కోపానికి కారణం కాపరానికి వచ్చి పది హేనేళ్ళు అయింది. ఒక్క నగా చేయించలేదు.

లక్ష్మి రోజూ సాధిస్తూనే వున్నది. ఇద్దరు పిల్ల లతో సిటీలో కాపరం. బంగారం కొనలేనంత ప్రియమైన ఈ రోజుల్లో మధ్య తరగతి కుటుం బీకులు నగలేం చేయిస్తారు. శ్రీపతి వ్రాసిన నవలలకి వచ్చిన డబ్బుతో పుస్తకాలుకొనేస్తుంటాడు. ఇంట్లో మూడు బీరువాల నిండా పుస్తకాలే. ఆ రోజు 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము' అనే పుస్తకం కొనుక్కుని వచ్చాడు. అందుకని లక్ష్మి కోపం తారాస్థాయి నందు కుంది.

''ఎందుకంత కోపం'' అన్నాడు అనునయంగా.

''నల్లపూసల గొలుసు చేయించమంటే చేయిం చలేదు. ఎక్కడి డబ్బు ఆ పుస్తకాలకి తగలేస్తారు'' అంది కోపంగా విసురుగా శ్రీపతి చెయ్యి నెట్టి పారేస్తూ.

''ఈ రోజుల్లో బంగారం పెట్టుకుంటే దొంగలు కొట్టి తీసుకునిపోతారు. రోజూ పేపర్లో చూడడంలా. వున్నవాళ్ళు నగలు పెట్టుకోకుండా బాంక్ లాకర్లలో దాచుకుంటున్నారు. అయినా ఇప్పుడు ఆ గొలుసు లేకపోతేనేమి. నీవు నా కళ్ళకి నగలు పెట్టుకోకపోయినా బాగానే వున్నావు'' అన్నాడు.

''ఈ మాటలకేం. ఒక్క నల్లపూసల గొలుసు చేయించమంటే ఇన్ని మాటలు చెబుతున్నారు. ఏదో కట్టలు కట్టలు నగలు దిగబోసినట్టు. లక్ష్మి అన్న పేరేగాని అంతా దరిద్రమే'' అన్నది. శ్రీపతి లక్ష్మి అజ్ఞానానికి, మూఢత్వానికి బాధపడ్డాడు. భార్యని సమాధానపర్చలేదు. బంగారం కొనలేదు. సాహిత్య విజ్ఞానం ముందు బంగారం విలువ లేనిదిగా కనపడుతుంది అతనికి.

ఎండాకాలం అంతా ఆరుబయట పడుకున్నారు.



రెండో ఆట విడిచిపెట్టారు. అంతా గాఢనిద్రలో వున్నారు. కిటికీ చువ్వలు వంచేసి దొంగలు ఇంట్లో ప్రవేశించారు. బీరువాలు, పెట్టెలు అన్నీ తీసి చూశారు. చిల్లర డబ్బులు తప్ప విలువగల వెండి, బంగారాలు కనపడలేదు. బీరువాలనిండా పుస్తకాలు. నగలు వుంటాయనుకున్న దొంగలకి నిరుత్సాహ మైంది. తాళం వేసివున్న బీరువా తీసి చూశారు. దాన్లో శ్రీపతి పత్రికల్లో వచ్చిన నవలలన్నీ తీసి బైండ్ చేయించాడు. మంచి మంచి ఆర్టికల్స్ తీసి భద్రపరిచాడు. పూర్వకాలపు తాళ పత్ర గ్రంథాలు తెలుగు నిఘంటువులు, భారత, భాగవత, రామా యణాలు జాగ్రత్తపెట్టాడు. కొంతమంది గ్రంథ చౌర్యం చేస్తారు. అందుకని ఆ బీరువాకి తాళం వేశాడు. దొంగలకి ఏమీ దొరకలేదని కోపం వచ్చింది. ఇంట్లో సామాను, పుస్తకాలు చిందర వందర చేసి, లక్ష్మి మెడలో ఏమన్నా వున్నాయేమో నని చూశారు. అలికిడికి మెలకువ వచ్చి లక్ష్మి అరవబోయింది. కత్తి చూపించి, ''ఛూ! వీడూ ఒక మొగుడేనా, పెళ్ళానికి ఒక్క నగ చేయించ లేదు. పుస్తకాల పిచ్చి వచ్చినవాడు'' అని తిడుతూ ప్రక్కనే పడుకున్న శ్రీపతిని ఇనప కడ్డీలతో దభీ దభీ బాది పారిపోయారు. శ్రీపతి 'అమ్మో, అమ్మో' అని అరిచాడు. అంతా లేచారు. పెళ్ళానికి నగలు చేయించకపోవడమూ తప్పేనా! అనుకుని. బాధతో మూలిగాడు శ్రీపతి.

''చూశారా! నగలు లేకపోవడంవల్ల దొంగలు, మిమ్మల్ని కొట్టిపోయినారు. నగలు వున్నట్టయితే అవి తీసుకుని వెళ్ళే వాళ్ళు. మీకీ దెబ్బలు తగిలేవి కావు'' అన్నది లక్ష్మి దెబ్బలు తగిలిన చోట కట్టు కడుతూ.

''గాడిదకేం తెలుసు సుగంధం వాసన'' పిచ్చి వచ్చిన వాళ్ళకి పుస్తకాల విలువేం తెలుస్తుంది! నగలు చేయిస్తే అవి ఎత్తుకుని పోయేవాళ్ళు. పుస్తకాలుకనుక భద్రంగా వున్నవి అనుకున్నాడు దెబ్బ తగిలిన చేతిని చూసుకుంటూ శ్రీపతి.

◆

## రహాస్యం

'మీ పత్రిక అన్ని పత్రికల కంటే ముందుగా పాఠకులకి న్యూస్ ఎలా అందించగలుగుతుంది' ఆసక్తిగా అడిగాడు రమణారావ్ ఎడిటర్ని.

''అది సీక్రెట్! అయినా అడిగారు కనుక చెపుతాను. మేము ప్రతి వీధి పంపు దగ్గరగా ఒక విలేకరి నుంచుతాం. అంతే'' సింపుల్‌గా చెప్పాడు ఎడిటర్.

— పి.వి. సుబ్బారాయుడు, హైదరాబాద్



## మర్యాద

ఆయన ఉపన్యాసం చెప్పి ఆగాడు. అనువాదకుడు వివరించి చెబుతూ, ''ఆయన భాషలో ఒక గొప్ప జోకు చెప్పారు అది నాకు పూర్తిగా అర్థం కాలేదు. అయినా దయవుంచి మర్యాద కోసం మీరంతా నవ్వండి'' అన్నాడు.

సభ ఒక్కసారి గొల్లుమంది. ఉపన్యాసకుడు గర్వంగా నవ్వుకుని ప్రసంగం కొనసాగించాడు.

—వెంకటాద్రి

